విద్యుత్ స్తంభానికి మంటలు



బండ్లగూడ: ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ కృష్ణారెడ్డి కాలనీ రోడ్ నెంబర్ 4లో ఉన్న కరెంటు స్తంభం వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్తంభానికి ఉన్న పలు కేబుల్ వైర్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే నాలుగు సీసీ కెమెరాలు, కాలనీ జంక్షన్ బాక్స్, మీటర్ బాక్స్ పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో దాదాపు రూ. 35 వేల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

సన్మానం



బండ్లగూడ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ బోధనేతర సంఘం ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షుడిగా గెలుపొందిన రాజును ఆదివారం కిస్మత్‌పూర్‌లోని ఎస్‌ఈఆర్‌పీ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దేవాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలపై నిరంతరం కృషి చేసే వ్యక్తి రాజు అని కొనియాడారు. అసోసియేట్ అధ్యక్షుడు అనంతయ్య, నేతలు భగవాన్ దాస్, కె.అత్తయ్య, వనం నర్సింహ్మ, నర్సింహా, కె.సదానంద్, సత్యం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన 238 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సోమవారం మంజూరు పత్రాలను ప్రదానం చేస్తారని మున్సిపల్ మేనేజర్ నాగేందర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు వచ్చి పత్రాలను అందుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన జగదీష్‌ను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ధాత్రుత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం ఎంతో అవసరం ఉంటుందని ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత కొంపల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, ఔటర్‌రింగ్ రోడ్డు పక్కనే ఉన్న మంచిరేవుల శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 30వ తేదీన రాత్రి 7 గంటలకు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. 1వ తేదీన ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రస్నానం, హారతి, సాయంత్రం 6 గంటలకు అశ్వవాహన సేవ, ద్వాదశ ఆరాధన, దేవతా విసర్జన, సప్తాభహరణాల అలంకరణ, రుత్విక్ సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. రోజూ ఉదయం, సాయంత్రం హవనం, శాత్తుమురై, సేవకాలు, బాలభోగం, విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని అర్చకులు గూడా శ్రీనివాసాచార్యులు, వరదరాజాచార్యులు, రాజగోపాలాచార్యులు కోరారు.

శంషాబాద్‌లో ట్రాఫికర్!

- రోడ్డుపైనే నిలిపివేస్తున్న బస్సులు
- మలుపు తీసుకోనేందుకు వాహనదారులకు ఇబ్బందులు
- నడి రోడ్డే బస్టాప్ కావడంతో సమస్య తీవ్రం
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసుల తీరుపై సర్వత్రా నిరసన

జాతీయ రహదారి మలుపు వద్ద గజిబిజిగా ట్రాఫిక్



శంషాబాద్ సవేరా వద్ద రోడ్డుపైనే బారులు తీరుతున్న బస్సులు.. గజిబిజిగా తయారైన ట్రాఫిక్

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు గజిబిజిగా మారుతోంది. ఫ్లైఓవర్ ప్రారంభించిన తర్వాత కూడా ట్రాఫిక్ సమస్య తీరకపోగా సమస్య మరింత తీవ్రంగా మారుతుండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సవేరా వద్ద...

శంషాబాద్ పట్టణంలో షాద్‌నగర్, బెంగుళూరు వైపు వెళ్లే వాహనాలకు జాతీయ రహదారి పక్కన సవేరా హోటల్ వద్దే రోడ్డుపైనే బస్టాప్ కొనసాగుతోంది. సంవత్సరాల తరబడి ఉన్న ఈ సమస్య పరిష్కారించాలంటూ స్థానికులు గత సర్కారుతో పాటు ప్రస్తుత ప్రభుత్వానికి కూడా విజ్ఞప్తులు చేశారు. ఉన్నతాధికారులు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వరకు వినతిపత్రాలను సమర్పించారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి కాంగ్రెస్ నేతలు తీసుకెళ్లిన సమయంలో ఆయన తాను స్వయంగా చూశాను.. సమస్యను పరిష్కరించాల్సిన అవసరముందని కూడా హామీ ఇచ్చారు. అయినా ఇంతవరకు సమస్య పరిష్కార దిశగా చర్యలు శూన్యమనే చెప్పొచ్చు.

పరిష్కారమెప్పుడో..?

ఫ్లైఓవర్ లేనప్పుడు రోడ్డు విశాలంగా ఉండటంతో సవేరా హోటల్ ముందు బస్సులు నిలిపినా ట్రాఫిక్ సమస్య అంతగా ఉండేది కాదు. ప్రస్తుతం ఇక్కడ రోడ్డు విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల కోసం బస్సులు ఒకదాని వెనక ఒకటి రోడ్డు మొత్తం నిలిచిపోతుండటంతో పాత శంషాబాద్ వైపు నుంచి జాతీయ రహదారిలోకి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ అవుతో ఇతర వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటోంది. ప్రయాణికులు కూడా రోడ్డుపైకి పూర్తిగా వచ్చి నిలబడుతున్నారు. దీంతో వాహనాల మలుపు తీసుకోలేని దుస్థితి నెలకొంటోంది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను పట్టణానికి కొంత దూరంలో విశాలమైన ప్రాంతంలో టెర్మినల్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుందనే వాదనలూ లేకపోలేదు.

ట్రాఫిక్ నియంత్రణ తూచ్...

సవేరా బస్టాప్ వద్ద బస్సులు ఇతర వాహనాలు రహదారిపై బారులు తీరుతున్నా ఇక్కడ ట్రాఫిక్ నియంత్రించే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సందట్లో సడేమియగా అదే రద్దీలో షాద్‌నగర్, జడ్చర్ల తదితర ప్రాంతాలకు వెళ్లే జీపులు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నేతలు



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ 122వ కార్యక్రమాన్ని మణికొండ బీజేపీ నాయకులు వీక్షించారు. తన మనసులోని మాటల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌తో వెలుగులోకి వచ్చిన ఆధునిక యుద్ధ నైపుణ్యం, మూడు రోజుల్లోనే సైనికులు అందించిన అపూర్వ విజయానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. వ్యవసాయంలో ఆధునికి పద్ధతులను పాటించాలని డ్రోన్లతో జరుగుతున్న సాగు విధానంపై ఆయన సమగ్రంగా వివరించారన్నారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనటంతో పాటు దిన చర్యలో యోగాను భాగం చేసుకోవాల్సిన అవసరాన్ని మోదీ వివరించారని తెలిపారు. భారత్‌లో తయారీ వ్యవస్థను బలోపేతం చేయాలంటే మన వద్ద తయారయ్యే వస్తువులనే ప్రతి ఒక్కరూ వాడటం అలవాటుగా చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రధాన మంత్రి వివరించారని తెలిపారు. మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు సి.బీరప్ప, ఎం.రాఘవరెడ్డి, సత్యనారాయణ, బి.శివకుమార్, డి.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి ఉంటుందన్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా ఫిర్యాదులపై అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్–178 వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని... ఒంటిపై నలుపు రంగు, చెడ్డీ ధరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మార్చురీ సిబ్బందిని లేదా రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: కార్పొరేట్ ఆసుపత్రుల వారు మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. ఆదివారం డిలక్స్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటువంటి ఉచిత వైద్య శిబిరాల వల్ల వేలాది మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జునైది, మజ్లిస్ సీనియర్ నాయకులు మహ్మద్ ముస్తఫా తదితరులున్నారు.



ఆర్కన్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ఛాతి ఎముకలను తొలగించి కణితిని తీసేసిన వైద్యులు



కోలుకున్న రోగితో వైద్యబృందం

శంషాబాద్: ఛాతి ఎముకల వెనుక ఏర్పడిన క్లిష్టమైన కణితిని ఆర్కన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆస్పత్రి వైద్య బృందం మీడియాకు వెల్లడించింది. మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణ ఏడాది కిందట పొలంలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. కొద్ది కాలం తర్వాత ఛాతి వెనుక తీవ్రమైన నొప్పి వస్తుండటంతో పలుచోట్ల వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. ఇటీవల ఆర్కన్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు సింగపూర్‌లో వైద్య విద్యనభ్యసించిన ప్రముఖ కార్డియోథొరాసిక్ వాస్కులర్ సర్జన్ అరుణ్ కనాల నేతృత్వంలో ప్లాస్టిక్ సర్జన్ మధువినయ్, ఆర్థోపెడిక్ వంశీమోహన్, క్రిటికల్ కేర్ వైద్యనిపుణులు ఖాద్రీ, ఆస్పత్రి ఎండీ, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యనిపుణులు చంద్రకాంత్‌ల బృందం శస్త్ర చికిత్స ద్వారా గుండె, ఊపిరితిత్తులకు ఇబ్బందులు కలగకుండా ఛాతి ఎముకలను తీసి వెనుక ఉన్న కణితిని తొలగించారు. అక్కడ ప్రత్యేక లేయర్‌ను అమర్చినట్లు వైద్య బృదం వివరించింది. ఆరు రోజుల్లో రోగి పూర్తిగా కోలుకున్నాడని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా రైతు కుటుంబ సభ్యులు వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ్‌యాదవ్



మణికొండ: ఆస్పత్రులు, సేవా సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.దశరథ్‌యాదవ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం ధన్వి మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్, రిథమ్ స్పెషాలిటీ క్లినిక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనం సమతుల ఆహారాన్ని తీసుకోకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవటంతో చాలామందికి పలు రోగాలు వస్తున్నాయన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలలో వాటిని ముందుగా తెలుసుకుని వైద్యుల సలహాలు పాటించి నయం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రోగం ముదిరి పరిస్థితి చేతుల దాటకముందే ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వి.బాల్‌రెడ్డి, ధన్వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్ ఎండీ కె.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్‌లు, సిబ్బందితో పాటు వందలాది మంది టౌన్‌షిప్‌వాసులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

గోల్కొండ: మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకునే వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా హకీంపేట్ లిమ్రా చౌరస్తా నుంచి నానల్‌నగర్ మోరాయిన్ బేకరీ వరకు వేలాది మందితో కూడిన మానవహారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రధానిగా ఎన్నికైన నాటి నుంచి ముస్లింలపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో మెహిదీపట్నం చౌరస్తా వద్ద ఆల్ పార్టీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, సయ్యబ్‌భాయి, రహీముల్లాఖాన్ నియాజీ తదితరులున్నారు.

ఘనంగా గాయత్రి పొదుపు సంఘం వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీ శ్రీ గాయత్రీ పొదుపు సంఘం 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భావన ఋషి ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘం సభ్యులు పాల్గొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి జమ ఖర్చుల పట్టిక, ఆదాయ–వ్యయాల వివరాలు, ఆస్తులు, బాధ్యతలపై పూర్తి నివేదికను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. అధ్యక్షుడు ఏదిరే శ్రీనివాస్ నేతత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువిషయాలపై చర్చించి ఆమోదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మొదటి వార్షికోత్సవం నుంచి సేవలందించిన మాజీ కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

గాయత్రి పొదుపు సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ సలహాదారులు కూడికల గణమ్మ సమక్షంలో ఆడిటర్ వెంకటేష్, లక్ష్మీనారాయణ ఎన్నికలను నిర్వహించారు. ఏదిరే శ్రీనివాస్, దశపతి భిక్షపతి, ఏర్వ కుమారస్వామి, దశపతి రాజు, అదేట్ల బాలరాజ్, అదేట్ల నరేష్, గాజుల సురేష్‌యాదవ్, గుర్రం తిరుపతమ్మ, గంజి రాజేశ్వరి, సగ్గం మహేందర్, ముదిగొండ సత్యనారాయణ, కూడికల ప్రభాకర్, మేకల సాయికిషోర్, వర్కల శ్రీశైలం, మసిని వనజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సభ్యులు పున్న మహేష్, మ్యాడం రాజు తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన

ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ప్రహరీ తొలగించాలని డిమాండ్



మైలార్‌దేవ్‌పల్లి: శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద గోడ నిర్మించడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు. శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి కార్యక్రమంలో భాగంగా పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం శివరాంపల్లి రైల్వేస్టేషన్ ప్రహరీ నిర్మాణాన్ని వ్యతిరేకించారు. తక్షణమే ప్రహరీని తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోడ నిర్మాణం వల్ల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే ఈ గోడను తొలగించాలని గతంలోనే పలుమార్లు ఎమ్మెల్యే, కార్పొరేటర్, రైల్వే అధికారులను కలిసి విన్నవించామన్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. వెంటనే ఈ గోడను కూల్చివేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, రఘుయాదవ్, సోమ శ్రీనివాస్, భగవాన్‌దాస్, అరుణ్ ముదిరాజ్, సురేష్, కొంపల్లి జగదీష్, చిరంజీవి, వెంకటరమణ, రాజు, అశోక్, సునీల్, రాజు, రత్నం, కురుమయ్య, సంతోష్, లక్ష్మణ్, రాజు, లక్ష్మి, సరిత, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రణవ భక్త సమాజం శతాబ్ది ఉత్సవాలు



స్వామిజీలను సన్మానిస్తున్న సమాజం సభ్యులు

అత్తాపూర్: పూర్ణాహుతి, గణపతి సహిత రుద్ర హోమం, మహాత్ముల దివ్య ప్రవచనాలతో అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో ప్రణవ భక్త సమాజం ఏకశత పంచోత్తర మహోత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. నిత్యాన్నదానంలో భక్తులకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరి రోజు ఆదివారం శ్రీశ్రీశ్రీ పరిశుద్ధానందగిరి స్వామి, శంకరానందగిరి స్వామి, వీరానంద బ్రహ్మచారి దివ్య ప్రవచనాలు భక్తులకు ఆకట్టుకున్నాయి. సమాజం అధ్యక్షుడు మొండ్ర నర్సింహ, నేతలు పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్, ఎస్.బి.హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్‌ను భాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, మొండ్ర కొమురయ్య, రంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నేతల పరామర్శ



శంషాబాద్: శంషాబాద్ 17 వార్డు మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్‌కు ఇటీవల మాతృవియోగం జరగడంతో బీఆర్ఎస్ నేతలు ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.కార్తీక్‌రెడ్డితో పాటు శంషాబాద్ బీఆర్ఎస్ నేతలు మోహన్‌రావు, కొనమొల్ల శ్రీనివాస్, రాజేందర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌కే పట్కర్-ఖత్రి సమాజం ఎన్నికలు



నూతన కార్యవర్గం ఎన్నిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎస్ఎస్‌కే పట్కర్–ఖత్రి సమాజం 2025–28వ సంవత్సరాలకుగాను ఎన్నికలు ఆదివారం రంగారెడ్డి జిల్లా రాఘవేంద్ర నగర్‌లోని సమాజ కార్యాలయంలో నిర్వహించారు. మన తెలంగాణ ఎస్ఎస్‌కే ప్రాంతీయ సమాజ్ న్యాయ సహదారులైన కర్తన్ చంద్రశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. డాక్టర్ అశ్వినీకుమార్ మెంగ్జీ, రాజ్ కుమార్ జ్యోతి ఎన్నికల కమిటీ సభ్యులుగా సహకరించారు.

నూతన కార్యవర్గం...

అధ్యక్షుడిగా డాక్టర్ ఆనంద్‌రావు మెంగ్జీ, ఉపాధ్యక్షుడిగా ఉమేశ్ చవాన్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్ హబీబ్, సంయుక్త కార్యదర్శిగా మహేశ్ చవాన్, కోశాధికారిగా రజనీకాంత్ తిర్మల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజేంద్రనగర్ సమాజానికి చెందిన పలువురు సభ్యులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. ఫలితాల ప్రకటన అనంతరం నూతన అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ రావు మెంగ్జీ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజం అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు.

మున్నూరు కాపు భవనాన్ని నిర్మిస్తాం

ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్

మణికొండ: మున్నూరు కాపు కులస్తులకు కోకాపేటలో కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో త్వరలోనే ఆత్మగౌరవ భవనం, వసతిగృహం నిర్మాణానికి కృషి చేస్తామని ప్రభుత్వ చీఫ్ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన కుల సంఘం నాయకులతో కలిసి కోకాపేటలో కేటాయించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం పలు కులాలకు భూములను కేటాయించి భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయటంలో విఫలం అయ్యిందన్నారు. ఒకటి, రెండు కులాల భవనాల నిర్మాణం పూర్తి అయినా వాటిల్లో ఎలాంటి కార్యకలాపాలను ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉంచారన్నారు. మున్నూరు కాపు కుల భవనం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి నిధులను విడుదల చేయిస్తామన్నారు. జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, గండిపేట మండల నాయకుడు గోపాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మున్నూరు కాపుల భూమిని పరిశీలిస్తున్న చీఫ్ విప్ తదితరులు